సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 13 । ఏప్రిల్ । 2023



బస్సును ఢీకొట్టిన బైక్

ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి బైక్ ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు.

8లో ▸



ముగ్గురి అరెస్ట్

తణుకు ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను తణుకు పోలీసులు అరెస్ట్ చేశారు.

8లో ▸

వేటకు విరామం

వేట బోట్లకు లంగరు పడుతోంది. సముద్రంలో వేట నిషేధం గురువారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి రానుంది.

8లో



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం సాయంత్రం	సహరి శుక్రవారం వేకువజాము
భీమవరం	6.26	4.27
తాడేపల్లిగూడెం	6.28	4.37
నరసాపురం	6.26	4.27

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీగా జయమంగళ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న జయమంగళ

సాక్షి, అమరావతి : రాష్ట్ర శాసనమండలికి నూతనంగా ఎంపికైన ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ బుధవారం వెలగపూడిలోని శాసనసభ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేశారు.

నేత్రపర్వం.. శ్రీనివాసుని కల్యాణోత్సవం



పెండ్లి ముస్తాబులో స్వామి, అమ్మవార్లు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న దేవస్థానం ఉపాలయం లక్ష్మీపురంలోని సంతాన వేణుగోపాల జగన్నాథ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీనివాసుని దివ్యకల్యాణ మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ ఆవరణలో స్వామివారిని పెండ్లి కుమారుడిగా, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా ముస్తాబు చేశారు. ఆలయ ఆవరణలోని సింహాసనంపై కల్యాణమూర్తులను వేంచేపు చేసి కల్యాణ తంతు జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

సాక్షి, భీమవరం: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మాల మహానాడు ఆధ్వర్యంలో చేపట్టిన వారోత్సవాల్లో భాగంగా బుధవారం భీమవరంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ మాట్లాడుతూ పట్టణంలోని ఏఎస్ఎన్ రాజు చారిటబుల్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్‌లో నిర్వహించిన శిబిరానికి విశేష స్పందన వచ్చిందన్నారు. తమ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 30 వరకూ జిల్లావ్యాప్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామన్నారు. మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సంధి జయరాజు, జిల్లా అధ్యక్షుడు నేతల సువర్ణరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి నన్నేటి నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా షూటింగ్‌బాల్ జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

ఆకివీడు: పశ్చిమగోదావరి జిల్లా సీనియర్ షూటింగ్‌బాల్ జట్లకు బుధవారం స్థానిక డాక్టర్ ఏఎస్ఎన్ రాజు స్పోర్ట్సు అకాడమీలో ఎంపిక పోటీలు నిర్వహించినట్టు షూటింగ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ప్రియాంక తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 22, 23 తేదీల్లో అనంతరపురం జిల్లా రోళ్ల గ్రామంలోని గురుకుల పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పోటీలకు 15 మంది బాలురు, 15 మంది బాలికలను ఎంపిక చేశామన్నారు. పోటీలను అకాడమీ చైర్మన్ ఏఎస్ఎన్ రాజు, నాగరాజు, ప్రభాకర్, ఏలియా, రమేష్‌రాజు, జిల్లా అసోసియేషన్ కో–ఆర్డినేటర్ వి.గణేష్, పీడీ కృష్ణవేణి పర్యవేక్షించారు.

చకచకా రీ సర్వే

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకంలో చేపట్టిన ఫేజ్–2 భూముల రీ సర్వే పనులు చురుగ్గా సాగుతున్నాయి. జిల్లాలోని 283 గ్రామాల్లో సర్వే మొదలుపెట్టగా ఇప్పటివరకూ 70 శాతం డ్రోన్ ఫ్లై పూర్తిచేశారు. పలు గ్రామాల్లో డ్రోన్ ఫ్లై ఆర్థోరెటిఫైడ్ ఇమేజెస్ ప్రక్రియ పూర్తి చేయగా.. మిగిలిన గ్రామాల్లో ఫొటోస్, డ్రోన్ ఫ్లై పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఫేజ్–2 రీ సర్వే పూర్తి చేయడానికి అధికారులు పటిష్ట కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు.

5.17 లక్షల ఎకరాల్లో..

జిల్లాలో ఫేజ్–2లో 5.17 లక్షల ఎకరాల్లో సర్వే చేయనున్నారు. ఇందులో ప్రైవేట్ భూమి 4.56 లక్షల ఎకరాలు, ప్రభుత్వ భూమి 61 వేల ఎకరాలు ఉంది. సర్వే పూర్తిచేసి సుమారు 3 లక్షల మంది రైతులకు హక్కు పత్రాలు అందించనున్నారు.

16 గ్రామాలు.. 5,656 హక్కుపత్రాలు

జిల్లాలో ఇప్పటికే ఫేజ్–1లో 16 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశారు. 6,187 మంది రైతులకు 5,656 జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పత్రాలను అందించారు.

ఆధునిక పరికరాలతో..

సర్వే, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో సర్వే పనులు చేస్తున్నారు. ఆధునిక పరికరాలు డ్రోన్, రోవర్ వంటివి ఉపయోగిస్తున్నారు. ముందుగా సర్వే చేస్తున్న గ్రామాల్లోని భూములపై డ్రోన్ ఫ్లై చేసి ఇమేజ్‌ను సేకరించడంతో పాటు ఆర్థోరెటిఫైడ్ ఇమేజెస్ కోసం రోవర్ ఉపయోగిస్తున్నారు. సర్వే ఆఫ్ ఇండియా నుంచి నమూనా వచ్చిన తర్వాత భూముల సర్వే చేసి వేగంగా సరిహద్దు రాళ్లను ప్రభుత్వమే ఉచితంగా పాతిస్తోంది.

- ఫేజ్–2లో 283 గ్రామాల్లో పనులు
- 5.17 లక్షల ఎకరాల్లో రీ సర్వే
- ఇప్పటికే 12 గ్రామాల్లో పూర్తయిన వైనం
- ఫేజ్–1లో 60 వేల మందికి హక్కు పత్రాల పంపిణీ



ఉండిలో డ్రోన్‌తో సిబ్బంది

98 ఏళ్ల తర్వాత..

98 ఏళ్ల క్రితం నాటి బ్రిటీష్ పాలకులు రాష్ట్రంలో భూములను సర్వే చేసి వ్యవసాయం, గ్రామ కంఠం, ప్రభుత్వ భూములుగా విభించి వాటిని రికార్డుల్లో ఎక్కించారు. ఆ తర్వాత మరలా భూముల రీ సర్వే జరగలేదు. ఏళ్ల తరబడి ఉన్న రికార్డులు పాడవ్వడంతో భూ వివరాలు లభించడం కష్టంగా మారింది. దీంతో గ్రామాల్లో భూసమస్యలు నెలకొన్నాయి. వీటి పరిష్కారంపై దృష్టి సారించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూముల రీ సర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. ఉచితంగా భూముల రీ సర్వే చేయిచడం, సర్వే చేయించిన భూముల చుట్టూ కొలతల ప్రకారం సర్వే రాళ్లు ఉచితంగా వేయించి రైతుల మధ్య భూ సమస్యలు లేకుండా అలాగే మాయమైన భూములను మళ్లీ తిరిగి పొందేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు పరిష్కారమవుతున్నాయి. అలాగే అన్యాక్రాంతమైన ఆలయ భూములు, గ్రామ కంఠం భూములు బయటపడుతున్నాయి. దీనిపై రైతులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని విభాగాల్లో పూర్తయిన సర్వే

మండలం	గ్రామం	హెక్టార్లు
భీమవరం	నర్సింహపురం	453.97
కాళ్ల	జక్కరం	657.69
ఆకివీడు	అజ్జమూరు	483.80
ఆకివీడు	తరటావ	599.55
ఉండి	వెలివర్రు	708.77
పెంటపాడు	మీనవల్లూరు	1,529.25
అత్తిలి	స్కిన్నెరపురం	1,162.30
అత్తిలి	ఈడూరు	1,339.48
తాడేపల్లిగూడెం	జగన్నాథపురం	4,296.64
వీరవాసరం	తోకలపూడి	404.95
వీరవాసరం	అండలూరు	1,234.89
కాళ్ల	కోపల్లె	1,669.74



పోడూరులో సర్వే చేస్తున్న అధికారులు

70 శాతం డ్రోన్ ఫ్లై పూర్తి



భూముల రీసర్వేకు సంబంధించి ఫేజ్–2 కార్యక్రమం జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. సర్వేలో 70 శాతం డ్రోన్ ఫ్లై పూర్తి చేశాం. ఫేజ్–2లో 5.17 లక్షల ఎకరాల్లో సర్వే చేయనున్నాం. సుమారు 3 లక్షల మంది రైతులకు భూ హక్కు పత్రాలు అందజేస్తాం. సర్వేకు సంబంధించి రైతులకు సమస్యలు ఉంటే ప్రతి మండలంలో ఏర్పాటుచేసిన మొబైల్ మెజిస్ట్రేట్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు.

–జాషువా, జిల్లా సర్వేశాఖ అధికారి

భూసర్వే ప్రయోజనాలు

- ప్రభుత్వ భూమి గుర్తించడం.
- రికార్డుల ప్రకారం భూ విస్తీర్ణాన్ని నిర్ధారించడం.
- భూముల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం.
- భూ సమస్యలు పరిష్కరించడం.
- భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షించుకోవడం.

నేరాల నిరోధానికి ప్రత్యేక నిఘా

ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్ పరిధిలో నేరాలను నియంత్రించేందుకు నేరస్తులపై కఠిన వైఖరి అవలంబిస్తామని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. ఏలూరులోని రేంజ్ కార్యాలయంలో బుధవారం గుంటూరు రేంజ్ ఐజీగా బదిలీ అయిన జి.పాలరాజు నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా డీఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ రేంజ్ పరిధిలో ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లుగా పోలీసు వ్యవస్థలో పలు నూతన విధానాలకు శ్రీకారం చుట్టిందని, వాటికి అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని చెప్పారు. ప్రధానంగా బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై కఠినంగా ఉంటామని, నిందితులకు శిక్షలు పడేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. దిశా పెట్రోలింగ్ సమర్థవంతంగా నిర్వహిస్తూ బాధితులకు తక్షణమే అండగా నిలబడేలా పోలీస్ సిబ్బందిని పర్యవేక్షిస్తామని చెప్పారు. దిశా యాప్‌పై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పిస్తూ మహిళలు, విద్యార్థినుల ఫోన్లలో డౌన్‌లోడ్ చేయించి రిజిస్ట్రేషన్ చేయించేలా ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. రేంజ్ పరిధిలోని అన్ని జిల్లాల ఎస్పీలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మరింత మెరుగైన రీతిలో ఉత్తమ సేవలు అందించేలా పాటుపడతామన్నారు. పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.



డీఐజీ అశోక్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగిస్తున్న పాలరాజు

పొలంబడితో రైతులకు విజ్ఞానం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులు విజ్ఞానాన్ని పెంచుకుని ఆరోగ్య పంటలు పండించాలని ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఆకుతీగపాడులో బుధవారం క్లస్టర్ పొలంబడి ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి ఆయన హాజరయ్యారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ రైతే రాష్ట్రానికి వెన్నెముక అని భావించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నిరకాలుగా అండగా నిలుస్తున్నారన్నారు. విత్తు నుంచి పంట చేతికొచ్చే వరకూ తోడ్పాటు అందిస్తున్నారన్నారు. దళారుల బారిన పడకుండా పంటలను కొనుగోలు చేయడం, కస్టమ్ హైరింగ్ సెంటర్ల ఏర్పాట్లు, యాంత్రీకరణ, రైతు భరోసా కేంద్రాల ద్వారా సాయం అందిస్తున్నారన్నారు. పొలంబడి ద్వారా రైతులు నేర్చుకున్న విషయాలు తోటివారికి తెలియజేయాలని కోరారు. విత్తనశుద్ధి, యంత్ర పరికరాల వాడకం, తెగుళ్ల నివారణకు జీవామృతం, అగ్నేయాస్త్రం వాడకంపై వ్యవసాయశాఖ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు కచ్చితంగా పాటించాలన్నారు.



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి

సేంద్రియ పద్ధతులు మేలు: కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ రైతులు సేంద్రియ పద్ధతిలో పంటలు పండించడం ద్వారా ఆరోగ్య ఆహారాన్ని అందించవచ్చన్నారు. సాగును సహజ సిద్ధంగా చేపట్టడం ద్వారా విషతుల్యం లేని పంటలను పండించవచ్చన్నారు. ఆర్డీఓ దాసి రాజు, జిల్లా వ్యవసాయశాఖాధికారి జెడ్.వెంకటేశ్వర్లు మాట్లాడారు. అనంతరం రైతులకు మంత్రి కొట్టు సత్యనారాయణ పిల్లి పెసర విత్తనాలు అందించారు. డీఏఓ వెంకటేశ్వర్లు, ఏడీఏ పి.మురళీకృష్ణ, ఏఓ పార్థసారథి, రైతులు వీరాబత్తుల సత్యనారాయణ, వీరన్న, చింతల నాగరాజు, జాలపర్తి తదితరులను మంత్రి కొట్టు సన్మానించారు. జిల్లా వ్యవసాయశాఖ సలహా మండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, పార్టీ నాయకులు కొట్టు విశాల్, గుండుమోగుల సాంబయ్య, కొలుకులూరి ధర్మరాజు, సొసైటీ అధ్యక్షుడు బూరాడ శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఈబీసీ నేస్తంతో మహిళా సాధికారత

భీమవరం (ప్రకాశంచౌక్): మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఈబీసీ నేస్తం పథకం రెండో విడత ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన కార్యక్రమాన్ని బుధవారం భీమవరం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ వర్చ్యువల్‌గా వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఈబీసీ నేస్తం కింద 13,460 మంది మహిళలకు రూ.20.19 కోట్లు జమచేశామన్నారు. అగ్రవర్ణ పేదలు కమ్మ 3,091, రెడ్డి 2,496, ఆర్యవైశ్య 2,538, బ్రాహ్మణ 1,240, క్షత్రియ 3,858, వెలమ 45, ఇతర ఓసీ సామాజిక వర్గాలు 192 మంది మొత్తంగా 13,460 మందికి లబ్ధి చేకూరిందన్నారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కు అందించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, బీసీ కార్పొరేషన్ ఏఈఓ కె.ప్రమీలా రాణి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జీవీఆర్‌కేఎస్ఎస్ గణపతిరావు, కార్పొరేషన్ల డైరెక్టర్లు కామన నాగేశ్వరరావు, రేవూరి గోగురాజు, బొడ్డేటి సూర్య నారాయణ పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులతో సామాజిక సేవలు

జిల్లా అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు తోడ్పాటు ఇవ్వాలని, సీఎస్ఆర్ నిధులతో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం సీఎస్ఆర్ నిధుల వినియోగంపై పరిశ్రమల ప్రతినిధులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి పరిశ్రమ వార్షిక ఆదాయంలో రెండు శాతం నిధులను విద్యా, వైద్యం తదితర మౌలిక వసతుల అభివృద్ధికి వినియోగించాల్సి ఉందన్నారు. ఇప్పటికే కొన్ని పరిశ్రమల యాజమాన్యాలు స్వచ్ఛందంగా ఖర్చు చేస్తున్నాయని, వినియోగిస్తున్న నిధులు, పనుల వివరాలు జిల్లా యంత్రాంగానికి తెలియజేయకపోవడం, దుర్వినియోగం జరగడం వంటివి జరుగుతున్నాయన్నారు. పరిశ్రమల యాజమాన్యం సీఎస్ఆర్ నిధుల ద్వారా చేపట్టే పనుల వివరాలను ముందస్తుగా జిల్లా యంత్రాంగానికి తెలియజేసి ఆమోదం పొందాలని సూచించారు. పారిశ్రామికవేత్తలు నూతన జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. పనులకు సీఎస్ఆర్ నిధులు పూర్తిస్థాయిలో సరిపోని పక్షంలో అదనంగా ప్రభుత్వ నిధులను ఇవ్వడానికి కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. సీపీఓ బి.శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఉయ్యాల ఆదిశేషు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్.త్రినాథరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ కె.వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎ.లక్ష్మి పాల్గొన్నారు.



భీమవరం కలెక్టరేట్‌లో ఈబీసీ నేస్తం లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కాలనీల్లో మౌలిక వసతుల కల్పన

పెనుగొండ: జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్టు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం ఆచంట పారలో పాత లే అవుట్ రహదారి నిర్మాణానికి ఆయన శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలో అన్ని లే అవుట్లలో పైపులైను నిర్మాణాలతో పాటు విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. కొన్ని లే అవుట్లకు రహదారి నిర్మాణాలు చేపట్టామన్నారు. ఇప్పటికే అప్రోచ్ రోడ్డు నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మిగిలినవి త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన కాలనీలకు సైతం రహదారులు ఏర్పాటుచేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రజాసంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్, వైఎస్సార్ సీపీ టౌన్ ప్రెసిడెంట్ పెచ్చెట్టి సత్యనారాయణ, దేవస్థానం చైర్మన్లు నెక్కంటి రామలింగేశ్వరరావు, వేమన అప్పారావు, నాయకులు ఉల్లం రామానుజం, తప్పెట్ల వెంకట్రావు, గురుజు కోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.




కాలనీ రహదారికి శ్రీకారం చుడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

టీడీపీ మాజీ మంత్రి ప్రత్తిపాటికి పోలీసు నోటీసు

ద్వారకాతిరుమల: టీడీపీ మాజీ మంత్రి, జోన్–2 ఇన్‌చార్జి ప్రత్తిపాటి పుల్లారావుకు పశ్చిమగోదావరి జిల్లా ఉండి పోలీసులు మంగళవారం రాత్రి ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలో 41(ఎ) నోటీసు ఇచ్చారు. గతేడాది నవంబర్ 14న టీడీపీ ఆధ్వర్యంలో ఉండిలోని కోట్ల ఫంక్షన్ హాల్‌లో టీడీపీ ఆక్వా రైతుల పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నిబంధనలకు విరుద్ధంగా ఉండి మండలంలోని ఎన్ఆర్‌పీ అగ్రహారం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ దారిని దిగ్బంధించి సభ నిర్వహించారు. అంతేకాకుండా అక్కడే జాతీయ రహదారిపై ధర్నా చేసి ప్రజారవాణాకు అసౌకర్యం కలిగించారంటూ స్థానిక వీఆర్వో తిరుమలశెట్టి రాజు ఇచ్చిన ఫిర్యాదుపై ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, ఉండి మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు, ప్రత్తిపాటి పుల్లారావు, మాజీ మంత్రి కేఎస్ జవహర్ తదితరులపై ఆదేరోజు ఉండి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ఈనెల 11న ద్వారకాతిరుమలలో టీడీపీ నిర్వహించిన 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' అనే కార్యక్రమానికి విచ్చేసిన ప్రత్తిపాటికి స్థానిక మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు మొగతడకల లక్ష్మీరమణి ఇంటి ముందు ఉండి పోలీసులు నోటీసు ఇచ్చారు. పోలీసులు గాని, న్యాయమూర్తి గాని ఎప్పుడు, ఎక్కడ హాజరు కావాలన్నా అక్కడకు రావాలని నోటీసులో పేర్కొన్నారు. అయితే ఉండి పోలీసులు పల్నాడు జిల్లా చిలకలూరుపేటలోని తన నివాసం వద్దకు వచ్చి నోటీసు ఇచ్చారంటూ ప్రత్తిపాటి తన అఫీషియల్ ఫేస్‌బుక్ ఖాతాలో బుధవారం పోస్ట్ చేయడం చర్చనీయాంశమైంది.



ద్వారకాతిరుమలలో పోలీసులు ఇచ్చిన నోటీసుపై సంతకం చేస్తున్న ప్రత్తిపాటి



పోలీసు నోటీసు

98 డీఎస్సీ క్వాలిఫైడ్స్ జీవితాల్లో వెలుగులు

274 మందికి పోస్టింగులు

ఏలూరు(మెట్రో): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గతంలో ఎంపికై మిగిలిన 1998 డీఎస్సీ క్వాలిఫైడ్స్‌కు ఏలూరు కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జిల్లాపరిషత్ మీటింగ్ హాలులో కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఎంపికైన ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఆర్డర్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన నూతన ఉపాధ్యాయులంతా విద్యాభివృద్ధి విషయంలో కీలకపాత్ర పోషించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాలు ప్రతి విద్యార్థికీ అందించేలా కృషి చేయాలన్నారు. ఎంతో కాలం నిరీక్షణ తర్వాత దక్కిన ఉద్యోగాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్‌వీ రవిసాగర్ మాట్లాడుతూ డీఎస్సీ 1998 అభ్యర్థులకు కౌన్సెలింగ్ ప్రారంభించి పోస్టులకు ఎంపిక చేశామన్నారు. 274 మంది ఉపాధ్యాయులను కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా వారు కోరుకున్న స్థానాలకు ఎంపిక చేసి పోస్టింగ్ ఆర్డర్ ఇచ్చామన్నారు. పోస్టింగ్ ఉత్తర్వులు పొందిన ఉపాధ్యాయులంతా గురువారం సంబంధిత పాఠశాలల్లో జాయిన్ కావాలని సూచించారు. అసిస్టెంట్ డైరెక్టర్లు అవదాని, షరీఫ్, ఎంఈఓ సబ్బితి నరసింహమూర్తి కౌన్సెలింగ్ నిర్వహణకు సహకరించారు.



నియామక పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

క్లుప్తంగా

హైవేపై కారు దగ్ధం


అప్పనవీడు బైపాస్ వద్ద దగ్ధమవుతున్న కారు

పెదపాడు: అప్పనవీడు వద్ద జాతీయ రహదారిపై ఓ కారు దగ్ధమైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయవాడ నుంచి రాజమండ్రి వైపు వెళుతున్న కారు ఓవర్ హీట్ అవడంతో ఆపి రేడియేటర్‌లో నీరు పోస్తుండగా అకస్మాత్తుగా మంటలు చెలరేగి కారు దగ్ధమైంది. కారులో ఉన్న ప్రయాణికులు ముందే బయటకు రావడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే ఈ ఘటనకు సంబంధించి తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై బీ నాగబాబు చెప్పారు.

తేనెటీగల దాడిలో వృద్ధుడి మృతి

సాక్షి, భీమవరం: తేనెటీగల దాడిలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని చినరంగనిపాలెంకు చెందిన కె.సత్యనారాయణ (62) ఈనెల 7వ తేదీన జంక్షన్ రైల్వేస్టేషన్ రోడ్డులో వాకింగ్‌కు వెళుతుండగా తేనెటీగలు దాడి చేశాయి. వెంటనే ఇంటికి వెళ్లి చికిత్స తీసుకున్నా స్వాంతన చేకూరకపోవడంతో కుటుంబసభ్యులు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుధవారం ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు చెప్పారు.

పన్నుల వసూళ్లు వేగవంతం చేయండి

కైకలూరు (కలిదిండి): పంచాయతీల్లో పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని డీపీఓ జీవీకే ప్రసాద్ ఆదేశించారు. కలిదిండి ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం లోగా పన్నుల వసూళ్ల ప్రక్రియ పూర్తి చేసి వచ్చిన ఆదాయాన్ని ట్రెజరీలలో జమచేయాలన్నారు. గ్రామాల్లో నూరుశాతం చెత్త సేకరణ చేయడంతో పాటు తడి, పొడి చెత్త వేరుచేస్తూ వర్మి కంపోస్టు తయారుచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా మంచినీటి చెరువులు పూర్తి స్థాయిలో నింపాలని సూచించారు.

వేటకు విరామం

- నేటి అర్ధరాత్రి నుంచి సముద్రంలో చేపల వేట బంద్
- 61 రోజులపాటు అమలులోకి వేట నిషేధం
- సంద్రం నుంచి తీరానికి చేరుకుంటున్న బోట్లు
- ఈ ఏడాది ముందుగానే మత్స్యకార భరోసా లబ్ధి


నరసాపురంలో బోట్లను తీరానికి తెస్తున్న మత్స్యకారులు


సముద్రంలో వలకు చిక్కిన చేపలను ఒడ్డుకు తెస్తున్న మత్స్యకారులు

నరసాపురం: వేట బోట్లకు లంగరు పడుతోంది. సముద్రంలో 61 రోజుల పాటు వేట సాగించే వీలు లేకపోవడంతో బోట్లు ఒడ్డుకు చేరుకుంటున్నాయి. సముద్రంలో వేట నిషేధం గురువారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి రానుంది. నేటి నుంచి పూర్తిగా సముద్రంలో వేట నిషేధం అమల్లో ఉంటుంది. చేపల పునరుత్పత్తి సీజన్ కావడంతో ప్రతి ఏటా ఏప్రిల్ 14వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా సముద్రంలో వేట నిషేధం గత కొన్నేళ్లుగా అమలు చేస్తోంది. మళ్లీ జూన్ 14వ తేదీ అర్ధరాత్రి నుంచి బోట్లు సముద్రంలోకి వేటకు బయలుదేరి వెళతాయి. వేట నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశాలు ఉండటంతో మత్స్యశాఖ అధికారులు తీరంపై నిఘా పెట్టారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించి వేటకు వెళితే చర్యలు తీసుకుంటామని నరసాపురం మత్స్యశాఖ ఏడీ రాజ్‌కుమార్ చెప్పారు. ఇప్పటికే మత్స్యకారులకు అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు.

ఈ ఏడాది పెరగనున్న లబ్ధిదారుల సంఖ్య

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల నుంచి మత్స్యకార భరోసా పథకాన్ని మత్స్యకారుల కోసం అమలు చేస్తోంది. వేట నిషేధ సమయంలో మత్స్యకారులు వేరే ఉపాధి లేక ఖాళీగా ఉంటారు. ఈ రెండు నెలల పాటు నెలకు రూ.5 వేలు చొప్పున వేట సాగించే మత్స్యకార కుటుంబానికి రూ.10 వేలు చొప్పున వారి బ్యాంకు ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తోంది. ఇప్పటికి నాలుగు విడతలుగా మత్స్యకార భరోసా పథకం కింద సొమ్ములు జమ అయ్యాయి. ఈ ఏడాది కూడా మేలో సొమ్ములు జమ అయ్యేలా చర్యలు చేపడుతున్నారు. నరసాపురం తీరంలో 418 మంది మత్స్యకార భరోసా లబ్ధిదారులు ఉన్నారు. గత టీడీపీ హయంలో వేట నిషేధ సమయంలో కేవలం రూ 4.వేలు మాత్రమే ఇచ్చేవారు. అదీ 90 మందికి మాత్రమే దక్కేది. సవాలక్ష ఆంక్షలతో లబ్ధిదారుల ఎంపిక జరిగేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు మత్స్యకార భరోసా పథకం ద్వారా కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందిస్తోంది. గత టీడీపీ హయాంలో ఆలస్యంగా ఆగస్టు నెలలో రూ.4 వేలు ఇచ్చేవారు. అయితే జగన్ సర్కార్ గత నాలుగేళ్ల నుంచి మేనెలలోనే ఆర్థిక సాయం అందిస్తుండటం విశేషం. ప్రస్తుతం లబ్ధిదారుల సర్వే జరుగుతోంది. గత ఏడాది 418 మంది లబ్ధిదారులకు మత్స్యకార భరోసా అందించగా, ఈ ఏడాది లబ్ధిదారుల సంఖ్య 500 దాటే అవకాశం ఉంది.

గత ఏడాది అనుకూలించని వాతావరణం

గత ఏడాదిలో మొత్తం సముద్రంలో వేట కష్టంగా సాగింది. ముఖ్యంగా వరుస తుపాన్లు నేపథ్యంలో ప్రకృతి కన్నెర్ర చేయడంతో సముద్రంలో వేట సవ్యంగా సాగలేదు. వేట నిషేధం గడువు ముగిసిన తరువాత జూన్ నుంచి ఉత్సాహంగా వేట ప్రారంభించిన మత్స్యకారులను తుపాన్లు, వరదలు ఆటంకంగా మారాయి. దీంతో జూలై, ఆగస్టు, నవంబర్ లాంటి సీజన్ నెలల్లో కూడా బోట్లను తీరానికి చేర్చి లంగర్లు వేసుకునే పరిస్థితి. వచ్చే ఏడాది అయినా ప్రకృతి కరుణించి వేట ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగతుందని మత్స్యకారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రోజుకు 150 వరకు బోట్లతో వేట

నరసాపురం తీరంలో ప్రతి రోజూ వేట సాగుతుంది. విశాఖపట్టణం, మచిలీపట్టణం, కాకినాడ తదితర ఇతర జిల్లాలకు చెందిన చెందిన మెకనైజ్డ్ వేట బోట్లు కూడా ఇక్కడ వేట సాగిస్తుంటాయి. మొత్తంగా ప్రతి రోజూ 150 వరకు బోట్లు వేట సాగిస్తాయి. ఏటా ఈ ప్రాంతం నుంచి రూ.300 కోట్ల వరకు మత్స్య సంపద లభించడం, ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతులు జరుగుతుంటాయి.

ఇక రెండు నెలలు ఖాళీగానే



వేట నిషేధంతో రెండు నెలలు ఖాళీగానే ఉంటాం. మాకు వేట తప్ప మరో పని తెలియదు. ఖాళీగా ఉండే ఈ రెండు నెలలు వలలు బాగు చేసుకుంటూ ఉంటాం. మళ్లీ జూన్ నెల ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తూ ఉంటాం. తుపాన్లు కారణంగా గత ఏడాది వేట సరిగా సాగలేదు. ఈ ఏడాది అయినా వేట సరిగా సాగాలని కోరుకుంటున్నాం.

– ఒడుగు మల్లికార్జున్, మత్స్య కార్మికుడు, నరసాపురం

రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటోంది



వేట లేని రెండు నెలలు మాకు ఏ పనీ ఉండదు. మేము ఇంకో పని కూడా చేయలేం. ఖాళీగా ఉండే ఈ రెండు నెలలకు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించి ఆదుకుంటోంది. ఈ సొమ్ముతోనే కుటుంబం గడుస్తుంది. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– వల్లభ శంకరరావు, మత్స్య కార్మికుడు

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు


తణుకులో నిందితులను అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఆంజనేయులు

తణుకు: తణుకు ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులు బుధవారం పోలీసులకు చిక్కారు. వీరంతా ఇంటర్, బీటెక్ చదువుతున్న వారే కావడం గమనార్హం. తణుకు రూరల్ పోలీసుస్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు వివరాలను వెల్లడించారు. పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాల శివారు పాలమూరు గ్రామానికి చెందిన పంచదార స్నేహసత్యసాయి ఫణి, అదే మండలానికి చెందిన పెంకుళ్లపాడు గ్రామానికి చెందిన కొర్రా తేజ అలియాస్ ఆంబోతు, పాలకొల్లు పట్టణానికి చెందిన ఖండవల్లి జయవెంకటసాయి శ్రీతేజ ముగ్గురూ స్నేహితులు. వీరు ఇటీవల జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించాలనే దురాలోచనతో గంజాయి సరఫరా చేసేందుకు నిర్ణయించుకున్నారు. ఇటీవల విశాఖ జిల్లా పాడేరు వెళ్లిన వీరు రూ.20 వేలు విలువైన నాలుగు కిలోల గంజాయి కొనుగోలు చేసి మంగళవారం తణుకు చేరుకున్నారు.

స్థానిక రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో రూరల్ ఎస్సై కె.గుర్రయ్య ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి వీరిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి పొట్లాలు కట్టి కళాశాల విద్యార్థులకు విక్రయించేందుకు సమాయత్తమవుతున్న సమయంలో పోలీసులు దాడి చేసినట్లు సీఐ వెల్లడించారు. వీరిలో సాయిఫణి బీటెక్ చదువుతుండగా సాయిశ్రీతేజ ఇటీవల ఇంటర్ పూర్తి చేశాడు. వీరి వద్ద గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు చెప్పారు. ఈ కేసులో నిందితుల అరెస్టులో ప్రతిభ చూపిన ఎస్సై గుర్రయ్యతోపాటు కానిస్టేబుళ్లు మాధవరావు, అక్బర్, అన్వర్, మహేష్‌లను సీఐ అభినందించారు.

కాపుల ద్రోహి చంద్రబాబే

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- రావిపాడులో వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమ్మేళనం


ములగాల బాబ్జికి కండువావేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ తదితరులు

పెంటపాడు: గత ఎన్నికలలో అధికారంలోకి రావడం కోసం కాపులకు న్యాయం చేస్తానని చెప్పి అధికారం సాధించి వారిని నట్టేట ముంచిన నమ్మక ద్రోహి టీడీపీ నేత చంద్రబాబు అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. బుధవారం రాత్రి పెంటపాడు మండలం రావిపాడు గ్రామంలో మండల వైఎస్సార్ సీపీ నాయకుల ఆత్మీయ సమ్మేళనం సొసైటీ మాజీ అధ్యక్షులు ములగాల రామ సత్యనారాయణ (బాబ్జి) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ గత ఎన్నికల్లో చంద్రబాబు మోసాలు లెక్కకు మించినవన్నారు. అమరావతి పేరుతో లక్షల కోట్లు దోచుకునేందుకు చంద్రబాబు పన్నాగం వేశారన్నారు. ప్రజలు తగిన బుద్ధి చెప్పినా మరలా నేడు అధికారం కోసం తాపత్రయ పడుతున్నారన్నారు. ఈ మోసాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. చంద్రబాబుకు వంతపాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా ప్రశ్నించలేదన్నారు. కాపులకు సముచిత స్థానం కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చారన్నారు. ఈ గౌరవం పూర్తిగా కాపు సంఘ నాయకులదే అన్నారు. ప్రభుత్వ పథకాలతో పాటు, కాపు నేస్తం పేరిట వేలకోట్లు అందించిన ఘనత సీఎం జగనన్నదే అన్నారు. వచ్చే ఎన్నికలలో కాపులంతా జగనన్నకు అండగా ఉండాలన్నారు. ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిపై సీఎం వైఎస్ జగన్ చేస్తున్న కార్యక్రమాలకు ప్రతివారు ఆకర్షితులవుతున్నారన్నారు. గడపగడపలో, నీవే మా నమ్మకం, తదితర కార్యక్రమాలలో ప్రజలు నాయకులకు నీరాజనాలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో యువనేత కొట్టు విశాల్, ఎంపీపీ దాసరి హైమావతి, సొసైటీ అధ్యక్షులు దేవ వెంకటరమణ, గుండుమోగుల సాంబయ్య, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, పసల చంటి, వల్లూరి బ్రహ్మానందం, పాలా గణపతి, దేవరశెట్టి రాంబాబు, మాజీ సర్పంచ్ వింజమూరి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు బొచ్చెల తాతారావు, పేరిచర్ల కిరణ్‌కుమార్‌రాజు, సర్పంచ్ ఛాంబర్ అధ్యక్షులు పెన్నాడ సూరిబాబు, ముదునూరు సొసైటీ అధ్యక్షులు బూరాడ శ్రీనివాస్, చుండూరి సర్వేశ్వరరావు, మీనవిల్లూరు, కొండేపాడు, పెంటపాడు, ఆకుతీగపాడు తదితర గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 200 మంది చేరిక

ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్, సొసైటీ మాజీ అధ్యక్షులు ములగాల రామ సత్యనారాయణ (బాబ్జి) తన అనుచరులైన సుమారు 200 మంది ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఉపముఖ్యమంత్రి కండువాలు వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు.

ఫుడ్ కమిషన్ సభ్యురాలిగా గంజిమాల దేవి



కొయ్యలగూడెం: రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ సభ్యురాలిగా కొయ్యలగూడెం మండలానికి చెందిన గంజిమాల దేవి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జాతీయ ఫుడ్ కార్పొరేషన్ యాక్ట్ 2013 ప్రకారం ఫుడ్ కమిషన్‌లో ఒక చైర్‌పర్సన్, ఐదుగురు సభ్యులు, ఒక మెంబర్ సెక్రటరీ నియమించాల్సి ఉంది. అయితే ఈ కమిటీలో ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గానికి చెందిన వారు ఒకరు ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇచ్చిన ఉత్తర్వుల్లో కొయ్యలగూడెం మండలానికి చెందిన ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన గంజిమాల దేవికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. గంజిమాల దేవి ప్రస్తుతం డెల్టా బోర్డు చైర్‌పర్సన్‌గా విధులు నిర్వహిస్తుండటం తెలిసిందే. రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలిగా నియమితులైన గంజిమాల దేవికి పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రముఖులు అభినందనలు తెలిపారు.

లక్కవరంలో వ్యక్తికి కరోనా


లక్కవరంలో శానిటేషన్ పనులు చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: లక్కవరంలో 50 ఏళ్ల వయస్సు కలిగిన ఓ వ్యక్తికి కరోనా సోకింది. కూలీ పనులు చేసుకుంటూ జీవించే ఇతనికి గత రెండు రోజులుగా జ్వరం, నీరసం ఉండటంతో లక్కరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు ర్యాపిడ్ పరీక్షలు చేయగా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. అతడి రక్త నమూనాలను సేకరించి ఆర్‌టీపీసీఆర్ పరీక్షలకు పంపించినట్లు వైద్యాధికారి అశోక్‌కుమార్ చెప్పారు. ఈ వ్యక్తిని హోమ్ క్వారంటైన్‌లో ఉంచి, పరిసర ప్రాంతాల్లో ఉన్న వారికి వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో శానిటేషన్ పనులు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి పగడం నాగేశ్వరరావు చెప్పారు.

విద్యుదాఘాతానికి కూలీ మృతి


మృతిచెందిన సాయిల ఆంజనేయులు

టి.నరసాపురం: కొబ్బరికాయల లోడింగ్ పనులకు వెళ్లిన ఓ కూలీ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మెట్టగూడానికి చెందిన సాయిల ఆంజనేయులు (22) బుధవారం కొబ్బరికాయలు లోడ్ చేసే పనికి వెళ్లాడు. వల్లంపట్లలో కొబ్బరికాయలను వ్యాన్‌లోకి లోడ్ చేసిన అనంతరం వ్యాన్‌పైకి ఎక్కి కూర్చున్నాడు. వ్యాన్ ప్రధాన రహదారి వద్దకు వస్తుండగా, మార్గమధ్యలో విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తగిలి షాక్‌కు గురై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుని భార్య ప్రియాంక ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. మృతునికి 11 నెలల క్రితమే వివాహమైంది.

గడపగడపకు సంక్షేమం


ఆకివీడు: ఆకివీడు 5వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన బైక్

- ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు
- వీరిలో ఇద్దరి పరిస్థితి విషమం


తిమ్మాపురం వద్ద ఘటనా స్థలంలో తీవ్ర గాయాలతో ఉన్న సుజిత్

ద్వారకాతిరుమల: ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి బైక్ ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోల్‌కతాకు చెందిన శ్రీకాంత్, సుజిత్, రాజులు ప్రస్తుతం తణుకులో బంగారపు పనులు చేసుకుంటూ అక్కడే ఉంటున్నారు. బుధవారం శ్రీవారి దర్శనార్థం వీరు ముగ్గురూ ఒక బైక్‌పై ద్వారకాతిరుమల క్షేత్రానికి వెళుతున్నారు. తిమ్మాపురం సంతమార్కెట్ వద్దకు వచ్చేసరికి రోడ్డుపక్కన ఆగి ఉన్న ఏలూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును వీరి బైక్ వేగంగా వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడిపోయిన ముగ్గురు యువకులు తీవ్ర గాయాలు పాలయ్యారు. స్థానికులు, పోలీసులు హుటాహుటిన క్షతగాత్రులను రెండు 108 వాహనాల్లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు సమాచారం.

బైక్ ఢీకొని వెల్డర్ దుర్మరణం


మృతి చెందిన సత్యనారాయణ

పెనుగొండ: సిద్ధాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. నడిపుడికి చెందిన యనమదల సత్యనారాయణ (34) ఘటాల దిబ్బలో బుధవారం రాత్రి వెల్డింగ్ పని ముగించుకుని ఇంటికి మోటార్ సైకిల్‌పై వెళుతుండగా, సిద్ధాంతం నుంచి పెనుగొండ వైపు వెళుతున్న నక్కావారిపాలెంకు చెందిన యువకుల బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన సత్యనారాయణ ఘటనా స్థలంలోనే మృతి చెందగా, యువకులకూ గాయాలయ్యాయి. వీరిని 108లో తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు సత్యనారాయణకు భార్య, ఇద్దరు సంతానం. పెనుగొండ ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గరవళ్లదిబ్బపాలెంలో..

భీమవరం అర్బన్: బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. గరవళ్లదిబ్బ గ్రామానికి చెందిన బర్రె వెంకటేశ్వర్లు (58) కాలువలో చేపలు పట్టి జీవిస్తుంటాడు. మంగళవారం సాయంత్రం పనుల అనంతరం ద్విచక్రవాహనంపై జాతీయ రహదారిలో వెళుతుండగా వెనుకనుంచి మోటార్‌సైక్లిస్టు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అదుపుతప్పి కింద పడటంతో అతని తలకు తీవ్రగాయమైంది. స్థానికులు, కుటుంబ సభ్యులు భీమవరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే వెంకటేశ్వర్లు మృతి చెందినట్లు నిర్ధారించారు. కుమారుడు బర్రె శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఎస్సై డి.మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహాప్రస్థాన వాహన సేవలు ప్రారంభం


వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీధర్, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు (మెట్రో): వివిధ వ్యాధులతో ఆసుపత్రుల్లో చేరి దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయిన సందర్భాల్లో పార్థీవ దేహాలను వారి ఇళ్లకు ఉచితంగా తరలించడానికి ఎంపీ నిధులతో సమకూర్చిన మూడు మహాప్రస్థాన వాహనాలను ఏలూరు పార్లమెంటు సభ్యులు కోటగిరి శ్రీధర్ జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. రూ.24.60 లక్షల ఎంపీ నిధులతో సమకూర్చిన ఈ వాహనాలను ప్రారంభించిన అనంతరం ఎంపీ కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆలోచన మేరకు ఈ వాహనాలు సమకూర్చామన్నారు. ఈ వాహనాలు జిల్లాలోని నూజివీడు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి ఏరియా ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సేవలు నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఎంపీ కోటగిరి శ్రీధర్ తన ఎంపీ నిధులతో ఈ మహాప్రస్థాన వాహనాలను సమకూర్చడం అభినందనీయమన్నారు. ఏలూరు జీజీహెచ్, ఏరియా ఆసుపత్రులైన జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు ఏరియాల పరిధిలో ఆస్పత్రుల నుంచి పార్థీవదేహాలను ఈ వాహనాల్లో ఉచితంగా ఇంటికి తరలిస్తారన్నారు. డీసీహెచ్ ఏవీఆర్ మోహన్, అడిషనల్ డీఎంహెచ్ఓ రత్నకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు కేసులపై వేగంగా స్పందించండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో ఆక్రమణలకు గురైన దేవదాయ భూముల విషయంలో కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులు సత్వరమే పరిష్కారమయ్యేలా సంబంధిత దేవదాయ సంస్థల ఈఓలు చురుగ్గా స్పందించాలని ఏలూరు జిల్లా దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారి సీహెచ్ రంగారావు సూచించారు. బుధవారం నగరంలోని దేవదాయ శాఖ కార్యాలయంలో ఈఓలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవదాయ సంస్థలకు సబంధించిన భూముల విషయంలో ఇప్పటికే కోర్టు ఆర్డర్లు పొందిన స్థలాలను త్వరితగతిన స్వాధీనం చేసుకునేలా స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

బడుగుల ఆశాజ్యోతి పూలే



పూలే చిత్రపటానికి నివాళ్లులర్పిస్తున్న బీసీ నాయకులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): బలహీనవర్గాల ఆశాజ్యోతి పూలే అని బీసీ నాయకులు పేర్కొన్నారు. పూలే 196వ జయంతి వారోత్సవల్లో భాగంగా బుధవారం బీసీ ఉమన్స్ హాస్టల్ విద్యార్థుల కోసం వాటర్ ఫిల్టర్ అందజేశారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మారిశెట్టి నరసింహమూర్తి, ఇమ్మండి బెనర్జీ, కేశవభట్ల విజయ్, చిన్న, కాజులూరు మల్లేశ్వరరావు, సుధీర్‌లు పాల్గొన్నారు.

మాధవరంలో వేగంగా పైపు లైన్ నిర్మాణ పనులు



మాధవరం జగనన్న కాలనీలో జరుగుతున్న పైపు లైన్ పనులను పరిశీలిస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం జగనన్న కాలనీలో పైపు లైన్ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా పనులను నవాబుపాలెం సొసైటీ చైర్మన్ జడ్డు హరిబాబు పరిశీలించారు. డిప్యూటి సీఎం కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు కాలనీలో వేగవంతంగా పైపు లైన్ నిర్మాణపనులు చేస్తున్నట్టు హరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొలూరి వెంకన్న తదితరులు ఉన్నారు.

పంచారామక్షేత్రం ఈఓగా సురేష్ నాయుడు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక పంచారామ క్షేత్రం కార్యనిర్వహణ అధికారిగా చాగంటి సురేష్ నాయుడు బుధవారం బాధ్యతలను చేపట్టారు . కాళ్లకూరు వేకటేశ్వర స్వామి వారి దేవస్థానం ఈఓగా పనిచేస్తున్న ఆయన బదిలీపై పంచారామ క్షేత్రానికి వచ్చారు. ఈ సందర్భంగా ఈవో సురేష్ నాయుడు మాట్లాడుతూ గతంలో పంచారామ క్షేత్రం ఈఓగా ఏడేళ్లు పని చేశానని తెలిపారు. జిల్లాలోని భీమేశ్వర స్వామి దేవస్థానం, నరసాపురం గ్రూపు టెంపుల్స్ ఈఓగా పని చేశానన్నారు. పంచారామ క్షేత్రంలో త్వరలోనే నిత్య అన్నదానం ప్రారంభిస్తామన్నారు.

నిత్యావసరాల పంపిణీ

సాక్షి, భీమవరం: గుడ్ పీపుల్స్ హెల్పింగ్ హ్యాండ్స్ చేస్తున్న సేవాకార్యక్రమాలు అభినందనీయమని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ తోట భోగయ్య అన్నారు. పట్టణంలోని 25వ వార్డు చినపేటలో బుధవారం హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుంటి ప్రభ అధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లా కాకినాడ పట్టణానికి చెందిన శిలా ఆనంద కుమారి ఆర్థిక సహాయంతో పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ వన్‌టౌన్ కన్వీనర్ నల్లం రాంబాబు. భీమవరం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, పిల్లి ముసలయ్య పాల్గొన్నారు.

సడలింపుల వల్ల రైతులకు నష్టం

సాక్షి, భీమవరం: ధాన్యం కొనుగోలులో ప్రైవేటు వ్యక్తులు, మిల్లర్లు కొనుగోలు చేసేలా సడలింపు ఇవ్వడం వల్ల రైతులు మోసానికి గురవుతారని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ బుధవారం తాడేరులో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో కోయ పెద్దిరాజు, వలవల వెంకటేశ్వరరావు, తెలగంశెట్టి పోతురాజు, మెట్టి జక్కరయ్య పాల్గొన్నారు.

బసవ పున్నయ్యకు ఘన నివాళి

సాక్షి, భీమవరం: సమసమాజ స్థాపన కోసం జీవితం ధారపోసిన మాకినేని బసవపున్నయ్య జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని సీపీఎం జిల్లా కార్యదర్శి బి బలరామ్ అన్నారు. బసవపున్నయ్య వర్ధంతి సందర్భంగా భీమవరంలోని సుందరయ్య భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బలరామ్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే అంటరానితనం, కులవివక్ష పోవాలని ప్రజలంతా సమానమేననే మహోన్నత దృక్పథంతో ఆయన బసవపున్నయ్య ముందుకు సాగారని కొనియాడారు.

16న ప్రభుత్వ ఉద్యోగుల కౌన్సిల్ సమావేశం

ఉండి: భీమవరంలో ఈ నెల 16న నిర్వహించే రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల జిల్లా ద్వితీయ కౌన్సిల్ సమావేశానికి అన్ని శాఖల, అన్ని తరగతుల ఉద్యోగులు తరలిరావాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ భీమవరం డివిజన్ అధ్యక్షుడు కేడీఎస్ కెనడీ తెలిపారు. బుధవారం ఉండిలో గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం భీమవరం డివిజన్ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సమావేశాల పోస్టర్‌ను వారు విడుదల చేశారు. కార్యక్రమంలో వి.ఆంజనేయులు, ఎస్.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా జగనన్నే మా భవిష్యత్తు

- గడపగడపకూ గృహ సారథులు
- ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిని వివరిస్తున్న ప్రజాప్రతినిధులు



అత్తిలిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తనయుడు కారుమూరి సునీల్‌కుమార్

అత్తిలి: తణుకు, తాడేపల్లిగూడెం పట్టణాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుపై ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి తనయుడు కారుమూరి సునీల్‌కుమార్ చెప్పారు. అత్తిలి ఆకులవారివీధిలో బుధవారం ఆయన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఏ గడపకు వెళ్లినా ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగించాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. అవినీతి రహిత పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు మద్దతు తెలుపుతున్నారని పేర్కొన్నారు. జగనన్నే మా భవిష్యత్ బ్రోచర్స్‌ను అందించి, ఇంటి గోడలకు స్టిక్కర్లు అతికించారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణి ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, వైఎస్సార్‌సీపీ మండలనాయకులు పోలినాటి చంద్రరావు, మంగెన సూర్య, గారపాటి నాగరాజు, రంభ సూరిబాబు, కోరుకొల్లు వెంకట్రావు, బుడితి సుజన్‌కుమార్, కంకటాల సతీష్, గంటా నాగరాజు, ఆకుల చినబాబు, యడ్లపల్లి మణికుమార్, యాళ్ల సాధు సుందర్‌సింగ్, సైపు సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

తణుకు టౌన్: వైఎస్సార్‌సీపీ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని



దువ్వలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



రేలంగిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వివిధ గ్రామాల్లోని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, నాయకులు ఉత్సాహంగా నిర్వహించారు. సోమవారం రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు కారుమూరి సునీల్ కుమార్, జిల్లా వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు గ్రామాల్లో నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా తణుకు రూరల్ మండలం వేల్పూరు, దువ్వ, తేతలి, మండపాక, మహాలక్ష్మీ చెరువు, యర్రాయి చెరువు, ముద్దాపురం, కోనాల గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీఎస్ కన్వీనర్ కరిబండి రాజేష్, గృహ మిత్రాలు, గ్రామ సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు సచివాలయాల పరిధిలోని ఇంటింటికి వెళ్లి వారికి ప్రభుత్వం ద్వారా కలిగిన లబ్ధిని వివరించారు. దువ్వ గ్రామంలో కారుమూరి సునీల్ కుమార్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, ఎంపీపీ రుద్ర ధనరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, మండల రైతు విభాగం అధ్యక్షుడు దండు వెంకట కృష్ణంరాజు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, దువ్వ గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, సొసైటీ అధ్యక్షుడు జేకే రాజు, ఉప సర్పంచ్ కడియం రాంబాబు, నాయకులు ముళ్లపూడి బాబూరావు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహ మిత్రలు, తేతలి గ్రామంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, రైతు విబాగం ప్రధాన కార్యదర్శి సరెళ్ల కృపావరం, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, రాచర్ల సూర్యారావు, మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, నాయకులు కోట స్వామీజీ, సరెళ్ల సతీష్, దారం శ్రీనులతో పాటు గృహ మిత్రలు, వాలంటీర్లు, మండపాకలో ఎంపీటీసీ సభ్యులు కాళ్ల సన్యాసిరావు, సొసైటీ అధ్యక్షురాలు వై విజయమూర్తి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, లతో పాటు సచివాలయ కన్వీనర్లు, గృహ మిత్రలు, వాలంటీర్లు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మహాలక్ష్మీ చెరువు గ్రామంలో నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాలా శ్రీను, ఎంపీటీసీ సభ్యురాలు వెంకట దుర్గ, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వేల్పూరు గ్రామంలో...

తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, నాయకులు గ్రామంలోని వివిధ వార్డుల్లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీలు, నాయకులు, గృహ సారథులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను ఆశీర్వదించండి

ఇరగవరం: మండలంలోని రేలంగి గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటి గోడకు స్టిక్కర్లు అంటించి, బ్రోచర్‌ను అందించి వారికి చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వలంటీర్ గుర్రం నాగలక్ష్మీని పరామర్శించి, వలంటీర్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని కారుమూరి సునీల్ తెలిపారు. ఆమె వైద్యానికి అయ్యే ఖర్చును కారుమూరి సేవాసమితి ద్వారా అందించడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గృహ మిత్రలు ,సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, గ్రామా పార్టీ అధ్యక్షుడు పులుపు అనిల్, పులుపు సునీల్, నాయకులు చేబ్రోలు పెద్దిరాజు, మైనం పాము, వడ్డే మార్కేండేయులు, గ్రామంలోని నాయకులు పాల్గొన్నారు.

పెంటపాడు మండలంలో..

పెంటపాడు: మా నమ్మకం నువ్వే జగనన్న, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాలు బుధవారం పలు గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పెంటపాడు గ్రామంలో వైఎస్సార్ పార్టీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి, ఉపసర్పంచ్ ప్రసాదరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, బర్ల జయరాంబాబు తదితరుల ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో వెలగల శ్రీనివాసరెడ్డి, యూత్ అధ్యక్షుడు కొవ్వూరి బాస్కరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. మీనవిల్లూరులో బీసీ సంఘ నాయకులు చింతపల్లి శ్రీనివాస్, రావిపాడులో సొసైటీ అధ్యక్షుడు దేవ వెంకటరమణ, కొండేపాడులో పాలా గణపతి, మర్రే కృష్ణమూర్తి, దేవరశెట్టి రాంబాబు, వర్రే రామకృష్ణ తదితరుల ఆధ్వర్యంలో జరిగాయి.

రబీ వరికోతలు ప్రారంభం



కొండేపాడు గ్రామంలో ధాన్యం ఆరబెట్టిన రీతిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



మాసూళ్లు బాగుండటంతో రైతుల ఆనందోత్సాహాలు

- యంత్రాలతో పనులు
- ఖర్చు ఆదా అవుతుందన్న రైతులు
- నియోజకవర్గంలో 46వేల ఎకరాల్లో రబీ సాగు

పెంటపాడు: రబీ పంట తుది దశకు చేరుకొంది. ముందుగా సాగుచేసిన పొలాల్లో వరికోతలు ప్రారంభమయ్యాయి. మెట్టప్రాంతంలో మాసూళ్లు చేపట్టగా డెల్టాలో మరో వారంరోజుల్లో దాళ్వా మాసూళ్ల ముమ్మర దశ పనులు ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది గూడెం నియోజకవర్గంలో సుమారు 46 వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. అందులో పెంటపాడు మండలంలో 21.50 వేల ఎకరాలు, రూరల్ మండలంలో 25 వేలు ఎకరాలు సాగు చేస్తున్నారు. విత్తన పంటగా 1,121 రకం సుమారు 2 శాతం ఎకరాల్లో సాగు చే పట్టారు. ముందస్తుగా నాట్లు వేసిన చేలు కోతలు జరుగుతుండగా ఆలస్యంగా నాట్లు వేసిన చేలు కోతకు సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం గూడెం మండలంలో ముమ్మరంగా కోతలు సాగుతున్నాయి. పెంటపాడు మండలంలో రెండు రోజుల నుంచి కోతలు ప్రారంభించారు. వరికోత యంత్రాలతో కోతలు చేపట్టారు. పంటను ఒబ్బిడి చేసుకొనేందుకు ధాన్యాన్ని యంత్రాలతో కోసి రోడ్డుపైకి తీసుకొస్తున్నారు. తేమ శాతం బట్టి ఆరబెడుతున్నారు.అన్ని రైతుభరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల పనులు చేపట్టబోతున్నారు. దీనికి సంబంధించి అధికారులతో కిందిస్థాయి సిబ్బందికి సమావేశాలు కూడా జరిగినట్లు గూడెం ఏడీఏ పి. మురళీకృష్ణ, పెంటపాడు ఏవో పార్థసారధి తెలిపారు.దాళ్వా మాసూళ్లలో ధాన్యం ఎక్కువగా వచ్చే పెంటపాడు మండలాల్లో అధికశాతం ధాన్యం సేకరణ లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోంది.

అనుకూలించిన వాతావరణం



వాతావరణం అనుకూలించడంతో వరిసాగు ఈ ఏడు సజావుగా సాగింది. ఈనిక దశలో కూడా తెగుళ్ల ప్రభావం అంతగా లేదు. యంత్రాల వలన కోత కోయనవసం లేకుండా ధాన్యం ఎగరబోత కుప్పనూర్పు, వంటివి అవసరం లేకుండా ఎప్పటికప్పుడు కోత కోసిన ధాన్యాన్ని గట్టుపైకి తీసుకొస్తున్నాము. దీంతో ఖర్చు కూడా గణనీయంగా తగ్గుతోంది. దీంతో వాతావరణం పరిస్థితుల దృష్ట్యా ఎప్పటికప్పుడు పంట ఒబ్బిడి అవుతోంది. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించడంతో ఖర్చుకూడా ఇంకా తగ్గుతోంది.

– కట్టుబోయిన కృష్ణప్రసాద్, వ్యవసాయసలహామండలి అధ్యక్షులు, రైతు జట్లపాలెం

తగ్గిన ఖర్చు



రైతులు యంత్రాలను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. గతంలో కూలీల కోసం రైతులు పడిగాపులు పడేవారు ఈ లోగా వాతావరణం అనుకూలించకపోతే పంట నష్టం జరిగేది. నేడు యాంత్రీకరణతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. తక్కువ సమయంలో ఎక్కువ పని జరుగుతోంది. అలాగే ఖర్చు కూడా తగ్గుతోంది. వరికోతలకు కూలీలను పెడితే కోత, కట్టేత, కుప్పనూర్పు, ధాన్యం ఎగురబోత, వంటివి చేయడానికి సుమారు రూ. 10 వేల వరకు ఖర్చువుతోంది. అదే వరికోత యంత్రాలతో మాసూళ్లు చేసుకొంటే ఎకరాకు సుమారు రూ. 3500 ఖర్చు అవుతోంది. ప్రస్తుతం దిగుబడి 55నుంచి 60బస్తాల వరకు రకాన్ని బట్టి వస్తున్నాయి.

– పి. మురళీకృష్ణ, వ్యవసాయశాఖ ఏడీఏ తాడేపల్లిగూడెం

వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చిన ఘనత జగన్‌దే...!



సభలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని పట్టింపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రెండవ ప్రాధాన్యత రంగంగా వ్యవసాయ రంగం ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏనాడూ సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క రైతు ధాన్యం విక్రయించాలన్నా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. గోనె సంచుల నుంచి రవాణా వరకు అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. గన్ని బ్యాగులు, కూలి, రవాణా ఛార్జీలను రైతు పెట్టుకుంటే వాటికి సైతం సొమ్ములను రైతు ఖాతాకు జమ చేయడం జరుగుతుందన్నారు. ఏనాడూ చంద్రబాబు సకాలంలో రైతులకు పంట నష్టపరిహారం ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. రైతు శ్రేయస్సు కోసం పనిచేస్తున్న ప్రభుత్వాన్ని నమ్మాలన్నారు. చంద్రబాబు హయాంలో కమ్మ సామాజికవర్గం మొత్తం బాగుపడలేదని, కేవలం 10 నుంచి 15 మంది మాత్రమే లాభపడ్డారన్నారు. రాబోయే ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రిగా జగన్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, జిల్లా కోఆపరేటివ్ అధికారి ఎం.రవి కుమార్, డిస్ట్రిక్ట్ సబ్ డివిజనల్ అధికారి ఆర్.నరేంద్రకుమార్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి టి.శివరామప్రసాద్, డీఎస్‌వో ఎస్.సరోజ, తహసీల్దార్ వైకేవి.అప్పారావు, ఏడీఏ పి.మురళీకృష్ణ, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వీఎస్.వేణుగోపాల్, పంచాయతీ కార్యదరి ఫణికుమార్, సర్పంచ్ బొనిగే పోతన్న, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయలు, వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, ఎమ్పీటీసీలు జంపెల్లి సత్యవతి,మార్లపూడి సుబ్బారావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ముప్పిడి పెద్దబ్బులురెడ్డి, కొమ్ముగూడెం సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, నాయకులు, కొల్లా విజయలక్ష్మికుమారి, మండల సేవాదళ్ చైర్మన్ కొండుబోయిన కృపావరం, ఏఎంసీ చైర్‌పర్సన్ గుండుబోగుల వెంకటరమణ పాల్గొన్నారు.

పశువుల ప్రాణరక్షణకు అంబులెన్స్‌లు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



పట్టింపాలెం గ్రామంలో వెటర్నరీ అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం రూరల్: పశువుల ప్రాణరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అంబులెన్స్‌లను తీసుకొచ్చిందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని పట్టింపాలెం పశువైద్యశాలలో మొబైల్ అంబులెన్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 108 అంబులెన్స్‌లను పటిష్టం చేయడంతో పాటు ప్రజలకు వైద్యం మరింత చేరువ చేసేందుకు 104 సేవలను తీసుకొచ్చారన్నారు. అలాగే పశువులకు అత్యవసర వైద్యం అందించేందుకు అంబులెన్స్‌లను ప్రవేశపెట్టారన్నారు. గ్రామాల్లోనే పశువులకు వైద్యం అందించడం జరుగుతుందన్నారు. మూగజీవాల గురించి ఆలోచించిన మానవతవాది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, డీఎస్‌వో ఎస్.సరోజ, సివిల్ సప్లయిస్ డీఎం శివరామప్రసాద్, డీసీవో రవికుమార్, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొట్టు విశాల్, ముప్పిడి సంపత్‌కుమార్, వెలిశెట్టి నరేంద్రకుమార్, సర్పంచ్‌లు, ఎమ్పీటీసీలు పాల్గొన్నారు.

మెగా ఉచిత వైద్య శిబిరంలో 206 మందికి వైద్య పరీక్షలు



దువ్వలో మెగా ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న సునీల్ కుమార్

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో కారుమూరి సేవా సమితి, ఏలూరు ఆశ్రమం ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 206 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో 30 మందిని మెరుగైన వైద్య పరీక్షల కోసం రిఫర్ చేసినట్లు గ్రామ సర్పంచ్ అడ్డా బాబు తెలిపారు. రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదేశాల మేరకు బుధవారం దువ్వ గ్రామంలోని వైఎస్సార్‌సీపీ విలేజ్ క్లినిక్ వద్ద నిర్వహించిన ఈ మెగా ఉచిత వైద్య శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు కారుమూరి సునీల్ కుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా వివిధ వైద్య సేవా విభాగాలకు చెందిన వార్డులను ప్రారంభించారు. ఈ శిబిరంలో సాదారణ వైద్యం, ఎముకలు, కంటి, చెవి, ముక్కు, గొంతు, స్త్రీ వైద్యం, జనరల్ సర్జరీకి సంబంధించిన వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన 30 మందిని వివిధ ఆస్పత్రులకు రిఫర్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, సొసైటీ అధ్యక్షుడు జేకే రాజు, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, జిల్లా రైతు విబాగం అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్, మండల రైతు విబాగం అధ్యక్షుడు డీవీ కృష్ణంరాజు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎస్ గోపాల కృష్ణ, గ్రామ ఉప సర్పంచ్ రాంబాబులతో పాటు ఆశ్రమం ఆసుపత్రికి చెందిన వైద్యులు డాక్టర్ హరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ విభాగాలకు చెందిన వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు లింగారాయుడిగూడెంలో గడప గడపకు మన ప్రభుత్వం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని దండగర్ర పంచాయతీ పరిధి లింగారాయుడిగూడెం గ్రామంలో గురువారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వెలిశెట్టి నరేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం

వీరవాసరం: రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణకు సర్వ సన్నద్ధం చేస్తున్నామని మండల వ్యవసాయ అధికారి గీతాదేవి తెలిపారు. నందమూరి గరువు లోని రైతు భరోసా కేంద్రాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దాల్వా ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్నామని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న మాయిశ్చర్ మెషీన్లు, వేయింగ్ మెషీన్లను, ఇతర సామగ్రిని పరిశీలించారు. కార్యక్రమంలో రవికుమార్, కల్యాణి, శ్రీనివాసరావు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులకు లైసెన్స్‌లు తప్పనిసరి

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణం, ఆకివీడు, ఉండి, కాళ్ల మండలాల పరిధిలోని దుకాణాలు, సంస్థలు, వాహనాల యజమానులు లైసెన్స్ రెన్యువల్ చేయించుకోవాలని భీమవరం 2వ సర్కిల్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కె.శివనాగమల్లేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనేకమంది లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. లైసెన్స్ కోసం గ్రామ, వార్డు సచివాలయం, మీసేవా కేంద్రాల్లోను లేదా కార్మిక శాఖ పోర్టల్ ద్వారా లైసెన్స పొందవచ్చని పేర్కొన్నారు లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు.

అతిథి అధ్యాపక నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

తణుకు టౌన్: తణుకులోని చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ సబ్జెక్టు బోధించుటకు గెస్ట్ ఫ్యాకల్టీగా అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.ఎస్ వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీలో 55 శాతం మార్కులు సాధించి పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత పొందిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అభ్యర్థులు ఈనెల 15వ తేదీలోగా తమ దరఖాస్తులను కళాశాల కార్యాలయంలో అందజేయాలని కోరారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఈనెల 17వ తేదీన మౌఖిక పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తారని తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్‌లతో మౌఖిక పరీక్షలకు హాజరు కావాలని కోరారు.

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం (టీటీసీ): భారత ప్రభుత్వం మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్స్ అనే కొత్త స్కీంను భారత తపాలా శాఖ ద్వారా ప్రతి పోస్ట్ ఆఫీస్‌లోని ప్రవేశపెట్టినట్లు సూపరింటెండెంట్ సీవీ రామిరెడ్డి వెల్లడించారు. ఈ స్కీం మహిళా ఆర్థిక సాధికారతకు, ఆడ పిల్లలకు ఎంతో తోడ్పడుతుందని తెలిపారు. ఈ సర్టిఫికెట్స్ కనీస డిపాజిట్ రూ. 1,000 నుంచి గరిష్ట డిపాజిట్ రూ 2,00,000 వరకు డిపాజిట్ చేసుకోవచ్చునని, 7.5 శాతం వడ్డీ రేటు ఉందని తెలిపారు. కాల పరిమితి రెండు ఏళ్లు ఉంటుందన్నారు. ఖాతాదారునికి ఎద్దైనా ప్రాణాంతక వ్యాధి ఉన్నట్‌లెత్తై, ఆ ఖాతాను కొనసాగించే స్థితిలో లేనట్‌లెత్తై ప్రీ మెచ్యూర్‌గా క్లోజ్ చేసే వెసులుబాటు ఉందని తెలిపారు. స్కీంను మహిళలు, ఆడ పిల్లలు, అన్ని వయస్సులు వారు ప్రారంభించవచ్చునని తెలిపారు.